

పేకాట స్థావరంపై మెరుపుదాడి

మదనపల్లె పట్టణంలోని ఓ ప్రైవేట్ హోటల్‌లో నిర్వహిస్తున్న పేకాట స్థావరంపై పోలీసులు దాడులు నిర్వహించారు. -8లో..



మణిపూర్‌లో శాంతి నెలకొల్పాలి

మణిపూర్‌లో కేంద్ర ప్రభుత్వం శాంతిని నెలకొల్పాలని అఖిలపక్ష కమిటీ నేతలు, హిందూ, ముస్లిం, క్రిష్టియన్ మత పెద్దలు డిమాండ్ చేశారు. -8లో..

మదనపల్లె : టమాటా ధరలు (10 కిలోలు)

	కనిష్టం	గరిష్టం
మొదటిరకం	రూ.1290	రూ.1400
రెండోరకం	రూ.1050	రూ.1260

మార్కెట్‌కు వచ్చిన మొత్తం సరుకు : 423 మెట్రిక్ టన్నులు



పట్టుగూళ్ల ధరలు (రూ.లో)

రకం	కనిష్టం	గరిష్టం
బైవోల్టిన్	426	501
సీబీ	-	-

మార్కెట్‌కు వచ్చిన పట్టుగూళ్లు: 855.46 కిలోలు

న్యూస్‌రీల్

జాబ్‌మేళాతో ఉపాధి



మాట్లాడుతున్న జిల్లా ఎంప్లాయ్‌మెంట్ అధికారి సురేష్

రైల్వేకోడూరు: నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశం కల్పించడమే ముఖ్య ఉద్దేశంతో ఏపీ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ జాబ్ మేళాను నిర్వహిస్తోందని జిల్లా ఎంప్లాయిమెంట్ అధికారి సురేష్ తెలిపారు. మంగళవారం రైల్వేకోడూరు పట్టణంలోని సాయిడిగ్రీ కళాశాలలో స్కిల్ డెవలప్‌మెంట్ ఆధ్వర్యంలో మెగా జాబ్ మేళా నిర్వహించారు. ఇందులో 16 కంపెనీలు పాల్గొన్నట్టు ఆయన తెలిపారు. ఈ జాబ్ మేళాలో 1000 ఉద్యోగాలు భర్తీ చేయడానికి స్కిల్ డెవలప్మెంట్ అధికారులు ప్రణాళికలు సిద్ధం చేశారన్నారు. చదువుతో పాటు ప్రతి ఒక్కరూ నైపుణ్యాలను పెంపొందించుకోవాలన్నారు. అనంతరం జెట్పీటీసీ రత్నమ్మ మాట్లాడుతూ నిరుద్యోగ యువతకు పూర్తిస్థాయిలో ఉపాధి కల్పించేలా ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. ఈ జాబ్‌మేళాకు 424 మంది హాజరవ్వగా 176 మంది యువతీ, యువకులు ఉద్యోగాలు సాధించారని తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ ముత్యాల పెంచలయ్య, శ్రీనివాసులు, జిల్లా స్కిల్ డెవలప్మెంట్ అధికారి హరిక్రిష్ణ, వివిధ కంపెనీల ప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

పదోన్నతి పత్రాలు అందజేత



పదోన్నతి పత్రాలు అందుకున్న ఉద్యోగులతో జెడ్పీ చైర్మన్ ఆకేపాటి అమర్‌నాథరెడ్డి

కడప సెవెన్‌రోడ్స్ : జిల్లా పరిషత్‌లో రికార్డ్ అసిస్టెంట్లుగా పనిచేస్తున్న ఆరుగురికి జెడ్పీ చైర్మన్ ఆకేపాటి అమర్‌నాథ్‌రెడ్డి పదోన్నతులు కల్పించారు. ఇందుకు సంబంధించిన నియామక పత్రాలను మంగళవారం అందజేశారు. పాయసంపల్లె హైస్కూలులో పనిచేస్తున్న జి.రత్నకుమారిని పదోన్నతిపై చాపాడు మండలం నరహరిపురానికి బదిలీ చేశారు. సింహాద్రిపురంలో పనిచేస్తున్న కేవీ సతీష్‌రెడ్డిని అదే మండలం అంకాలమ్మగూడూరు హైస్కూలుకు, బద్వేలు బాలికల ఉన్నత పాఠశాలలో పనిచేస్తున్న ఎస్.వెంకటసుబ్బమ్మను బద్వేలు ఎంపీపీ కార్యాలయానికి, చిన్నమండెం మండలం మల్లూరు హైస్కూలులో పనిచేస్తున్న ఎస్.అజంతుల్లాబాషను సుండుపల్లె మండలం గుట్టకిందరాచపల్లెకు, కందిమల్లాయపల్లెలో పనిచేస్తున్న పి.గిరిబాబును కలసపాడు, కడప జెడ్పీలో పనిచేస్తున్న జె.రమేష్‌కుమార్‌ను వల్లూరు ఎంపీపీ కార్యాలయానికి బదిలీ చేశారు. విధులు సక్రమంగా నిర్వర్తించాలని జెడ్పీచైర్మన్ వారికి సూచించారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ సీఈఓ సుధాకర్‌రెడ్డి, డిప్యూటీ సీఈఓ రమణారెడ్డి, ఏఓ రంగాచార్యులు, పంచాయతీరాజ్ మినిస్ట్రీరియల్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్.నాగిరెడ్డి, సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు లంకా మల్లేశ్వర్‌రెడ్డి, బసిరెడ్డి పాల్గొన్నారు.

అడవిలో అరణ్య



అరణ్య విడిది కేంద్రం ఏర్పాటయ్యే ప్రాంతం

- కడప-రాయచోటి ప్రధాన రహదారిలోని గువ్వలచెరువు ఘాట్‌లో ప్రత్యేక విడిది
- పర్యాటకులను ఆకర్షించేలా అద్భుతంగా ఏర్పాట్లు
- బ్రిటీష బంగ్లా పడిపోయిన చోట గుర్తుగా గార్డెన్
- కొండమీద కెఫటేరియా, ఇతర పార్కుల ఏర్పాటుకు చర్యలు
- చుట్టూ ప్రకృతిని ఆస్వాదించేలా అటవీశాఖ ప్రణాళికలు

సాక్షి రాయచోటి : అడవిలో చుట్టూ పచ్చని కొండలు...మధ్యలో పెద్దపెద్ద లోయలు....ఘాట్‌రోడ్డు... అంతా పచ్చని చెట్లతో అడవిలో అందాలు. అలాంటి పచ్చని గిరుల మధ్య సేద తీరేందుకు ప్రత్యేక విడిది కేంద్రానికి అటవీశాఖ శ్రీకారం చుట్టింది. రాష్ట్ర ప్రభుత్వం నగర వనాలతోపాటు ఎకో పార్కులు, ఇతర పర్యాటక అభివృద్ధికి చర్యలు తీసుకుంటున్న తరుణంలో వైఎస్సార్, అన్నమయ్య జిల్లాల సరిహద్దు ప్రాంతమైన గువ్వలచెరువు ఘాట్‌లో అరణ్య పేరుతో అటవీ క్షేత్రం రూపుదిద్దుకుంటోంది. అక్కడ చిన్న పిల్లలు మొదలుకొని పెద్దల వరకు ఆహ్లాదంగా గడిపేందుకు అవసరమైన అన్ని చర్యలు చేపడుతున్నారు. ఇందులో భాగంగా ఈ ప్రాంతంలో పలు నిర్మాణాల కోసం రూ. 20 లక్షల వరకు వెచ్చించారు.

బ్రిటీషు బంగ్లా ప్రాంతంలో గార్డెన్

కడప నుంచి రాయచోటికి వెళ్లే జాతీయ రహదారిలోని గువ్వలచెరువు ఘాట్‌లోని శివాలయం సమీపంలో ఒకప్పుడు బ్రిటీషు వారు నిర్మించిన బంగ్లా ఉండేది. అయితే కొన్ని సంవత్సరాల క్రితం నక్సల్స్ ఫారెస్టు బంగ్లాను పేల్చి వేశారు. అయితే ప్రస్తుతం అరణ్య నిర్మాణంలో భాగంగా బ్రిటీషు బంగ్లా స్థానంలో గార్డెన్‌ను నిర్మించాలని అధికారులు సంకల్పించారు. రకరకాల వృక్షాలతోపాటు వివిధ రకాల పూల మొక్కలతో కొత్త హంగులు అద్దుకునేలా గార్డెన్ నిర్మాణం చేపడుతున్నారు.

సాహసవంతులకు ట్రెక్కింగ్

అటవీ ప్రాంతంలో నిర్మిస్తున్న అరణ్య క్షేత్రం వద్ద కొండ ప్రాంతం ఉంది. అక్కడ సందర్శకులు కొండను ఎక్కేలా, అలాగే లోయలోకి దిగేలా ట్రెక్కింగ్ ఏర్పాటు చేస్తున్నారు. సాహసవంతులకు ట్రెక్కింగ్ చేసుకునేందుకు అటవీ అధికారులు ప్రణాళిక రూపొందించారు.

కెఫటేరియా, పార్కు, విశ్రాంతి గదుల నిర్మాణం



కొనసాగుతున్న కెఫటేరియా నిర్మాణ పనులు

పర్యాటకులతోపాటు విడిదికి వచ్చే సందర్శకులు అక్కడ విశ్రాంతి, ఆహ్లాదాన్ని పొందేందుకు కెఫరేటియా నిర్మాణం చురుగ్గా సాగుతోంది. అంతేకాకుండా చిన్న పిల్లల కోసం ప్రత్యేకంగా చిల్డ్రన్స్ పార్కును కూడా ఏర్పాటు చేస్తున్నారు. అలాగే విశ్రాంతి గదుల నిర్మాణం, పార్కింగ్‌కు అనువుగా స్థలం కేటాయింపు, ఘాట్‌లో వ్యూ పాయింట్‌ను కూడా ఏర్పాటు చేస్తున్నారు. అలాగే సందర్శకుల అవసరాలకు తగ్గట్టుగా టాయిలెట్లు, తాగునీటి సౌకర్యం కలిస్తున్నారు. ఈ రహదారిలో ప్రతినిత్యం వేలాది వాహనాలు ఇదే అరణ్య పక్కనే ప్రయాణిస్తుంటాయి. అరణ్య ఏర్పాటుతో వాహనదారులకు కొండకోనలు, చెట్ల మధ్య ప్రత్యేక అనుభూతిని అటవీ శాఖ అందించనుంది.

అద్భుతంగా తీర్చిదిద్దుతున్నాం..



కడప నుంచి రాయచోటికి వెళ్లే ఘాట్‌రోడ్డు పక్కన అరణ్య కేంద్రాన్ని ఏర్పాటు చేస్తున్నాం. అద్భుత నిర్మాణాలతో ఆహ్లాదకర వాతావరణాన్ని సందర్శకులకు కల్పించనున్నాం. ఇక్కడ పార్కుతోపాటు గార్డెన్, కెఫటేరియా, వ్యూ పాయింట్, ట్రెక్కింగ్ ఇలా అన్ని సౌకర్యాలను కల్పిస్తున్నాం. అటవీశాఖ ఆధ్వర్యంలో అనువైన ప్రాంతాన్ని ఎంపిక చేసి అందంగా తయారు చేస్తున్నాం. ఇప్పటికే సుమారు రూ. 20 లక్షల వరకు ఖర్చు చేశాం. దాతలు సహకరిస్తే వారికి ప్రత్యేక గుర్తింపునిస్తాం.

– పీవీ సందీప్ రెడ్డి, జిల్లా అటవీశాఖ అధికారి, కడప

ప్రజల ఆహ్లాదానికి పెద్దపీట



రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకంగా ప్రజల ఆహ్లాదానికి ప్రత్యేక చర్యలు చేపడుతోంది. అన్నమయ్య జిల్లా పరిధిలో శిల్పారామం ఏర్పాటుకు చర్యలు వేగంగా కొనసాగుతున్నాయి. మరోవైపు నగర వనాలను అభివృద్ధి చేస్తున్నాం. మదనపల్లె, రాయచోటి ఇలా అన్నిచోట్ల ప్రత్యేకంగా ఆహ్లాదకరంగా పార్కులు మొదలుకొని ఇతరత్రా అన్ని చర్యలు చేపడుతున్నాం. గువ్వల చెరువు ఘాట్‌లో అటవీశాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసే అరణ్యతో సందర్శకులకు మంచి ఆహ్లాదకర వాతావరణం ఒనగూరనుంది.

– పీఎస్ గిరీషా, జిల్లా కలెక్టర్, రాయచోటి, అన్నమయ్య జిల్లా

ప్రభుత్వ భవన నిర్మాణాలు పూర్తి చేయాలి

- జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్



వీడియో కాన్ఫరెన్స్‌లో అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ గిరీషా పీఎస్

రాయచోటి : ప్రాధాన్యత క్రమంలో ప్రభుత్వ భవన నిర్మాణాలను వేగవంతంగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్ పంచాయతీరాజ్ శాఖ అధికారులను ఆదేశించారు. మంగళవారం సాయంత్రం స్థానిక కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో పంచాయతీరాజ్ శాఖ అధికారులతో ప్రభుత్వ ప్రాధాన్యత భవనాల నిర్మాణాలపై సమీక్ష నిర్వహించారు. సచివాలయాలు, ఆర్‌బీకేలు తదితర ప్రభుత్వ ప్రాధాన్యత భవనాలను త్వరగా పూర్తి చేయాలని, పూర్తి చేసిన భవనాలను వినియోగంలోకి తీసుకురావాలని అధికారులను ఆదేశించారు. వివిధ దశలలో ఉన్న నిర్మాణాలకు సంబంధించి బిల్లులను ఏతలు త్వరగా ప్రాసెస్ చేయాలని, ఎటువంటి ఆలస్యం చేయరాదని కలెక్టర్ సూచించారు. ప్రతి మండలానికి ఇచ్చిన లక్ష్యాలను సెప్టెంబర్ మాసానికల్లా పూర్తి చేయాలని ఈ సందర్భంగా కలెక్టర్ ఆదేశించారు.

ఎస్ఈకి విద్యుత్ ఉద్యోగుల సమ్మె నోటీసు

కడప కార్పొరేషన్: తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ పవర్ ఎంప్లాయీస్ జాయింట్ యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో విద్యుత్ శాఖ ఉద్యోగులు సమ్మెకు సిద్ధమయ్యారు. ఈ మేరకు మంగళవారం స్థానిక విద్యుత్ భవన్‌లో ఏపీఎస్‌పీడీసీ ఎల్ పర్యవేక్షక ఇంజినీరు ఎస్.రమణకు సమ్మె నోటీసు అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈనెల 27 నుంచి ఆగష్టు 10వ తేదీ వరకూ ఆందోళన కార్యక్రమాలు నిర్వహించాలని నిర్ణయించినట్లు వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో జేఏసీ చైర్మన్ యూఎస్‌కే బర్నవాస్, జనరల్ సెక్రటరీ ఎస్‌కే చాంద్‌బాషా, కన్వీనర్ ఎంవీ చలపతి, జిల్లా జేఏసీ నాయకులు శివభాస్కర్, యా కోబు, శ్రీపతి, జయప్ప, రమేష్ బాబు, ఫయాజ్ బేగ్, ఈశ నాగరాజు, భరణి, నాగేశ్వరరెడ్డి, క్రిష్ణ, అశోక్‌బాబు, దేవేందర్‌రావు పాల్గొన్నారు.

31న వైఎస్‌ఆర్ ఏఎఫ్‌యూ రెండో విడత ప్రవేశాలు



మాట్లాడుతున్న చైర్మన్, కన్వీనర్

ఏఎఫ్‌యూ: కడప నగరంలోని డాక్టర్ వైఎస్‌ఆర్ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్‌ఆర్ట్స్ విశ్వవిద్యాలయంలో ప్రవేశాలకు రెండోవిడత కౌన్సెలింగ్ ఈనెల 31న నిర్వహిస్తున్నట్లు ఏడీసెట్-23 కమిటీ చైర్మన్ ఆచార్య బి. ఆంజనేయప్రసాద్, కన్వీనర్ డా. ఇ.సి.సురేంద్రనాథ్‌రెడ్డి తెలిపారు. మంగళవారం వైఎస్‌ఆర్ ఏఎఫ్‌యూలో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడుతూ 2023-24 విద్యాసంవత్సరానికి సంబంధించి బీఎఫ్ఏ పెయింటింగ్, శిల్పం, యానిమేషన్, అప్లైడ్ ఆర్ట్స్, ఫొటోగ్రఫీ, బ్యాచిలర్ ఆఫ్ ఇంటీరియర్ డిజైన్ కోర్సుల్లో ప్రవేశానికి తొలివిడతలో హాజరుకాలేని విద్యార్థుల కోసం రెండోవిడత కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రవేశాలు పొందగోరు విద్యార్థులు జగనన్న విద్యాదీవెన, జగనన్న వసతిదీవెన పథకాల కింద ఫీజు రీయింబర్స్‌మెంట్ అర్హత కలిగిన వారందరూ కుల, ఆదాయ ధృవీకరణపత్రాలు, ఒరిజినల్ సర్టిఫికెట్లతో హాజరుకావాలన్నారు. కౌన్సెలింగ్ రోజే అభ్యర్థులకు సీటు కేటాయిస్తామని తెలిపారు.

దరఖాస్తుల ఆహ్వానం

రాయచోటి టౌన్ : ఓపెన్ 10వ తరగతి, ఇంటర్ (సైన్స్, ఆర్ట్స్ (గ్రూపులు) కోసం దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు అన్నమయ్య జిల్లా విద్యాశాఖాధికారి శ్రీరాం పురుషోత్తం మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఏపీ సార్వత్రిక విద్యా పీఠం (ఏపీఓఎస్ఎస్) ద్వారా 2023-2024 సంవత్సరానికి గాను 10వ తరగతి, ఇంటర్మీడియట్ ప్రవేశం కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు. జులై 26వ తేదీ నుంచి సెప్టెంబర్ 25వ తేదీ వరకు ఎలాంటి అపరాధ రుసుం చెల్లించకుండా దరఖాస్తులు చేసుకోవచ్చునని తెలియచేశారు. రూ.200 అపరాధ రుసుంతో అక్టోబర్ 5వ తేదీలోగా చెల్లించవచ్చునని వివరించారు. 10వ తరగతిలో చేరేందుకు 14 సంవత్సరాలు పూర్తిగా నిండి ఉండాలని, ఇంటర్‌లో చేరేందుకు 10వ తరగతి పాస్ అయి ఉండటంతో పాటు 15 సంవత్సరాలు నిండి ఉండాలని సూచించారు. మరిన్ని వివరాల కోసం ww-w.-apo pe nr-c-h-oo .a p.g-o-v.i n వెబ్ సైట్ నుంచి తెలుసుకోవచ్చునని తెలిపారు.


ప్రశాంతంగా వైవీయూ పాలకమండలి సమావేశం

వైవీయూ: యోగివేమన విశ్వవిద్యాలయం పాలకమండలి సమావేశం మంగళవారం ప్రశాంతంగా ముగిసింది. వైస్ చాన్సలర్ ఆచార్య చింతా సుధాకర్ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో వర్చువల్ విధానంలో ఏపీ ఉన్నతవిద్య ముఖ్యకార్యదర్శి శ్యామలరావు, ఏపీ ఉన్నతవిద్యామండలి చైర్మన్ ఆచార్య కె. హేమచంద్రారెడ్డి హాజరుకాగా, వైవీయూ పాలకమండలి సభ్యులు, రిజిస్ట్రార్ ఆచార్య వై.పి. వెంకటసుబ్బయ్య పాల్గొన్నారు. సమావేశంలో కోర్టు ఉత్తర్వులు మేరకు విశ్వవిద్యాలయాల్లో నియామకాలకు సంబంధించిన నోటిఫికేషన్‌లను రద్దు చేయడంతో, ఉన్నతవిద్యామండలి ఆదేశాల మేరకు నోటిఫికేషన్ ద్వారా నియమితులైన ఆచార్యుల పోస్టులను రద్దు చేస్తూ పాలకమండలి నిర్ణయం తీసుకుంది. దీంతో పదోన్నతులు పొందిన ఆచార్యులను తిరిగి వారి పూర్వస్థానాల్లో విధులు నిర్వహించేందుకు పాలకమండలి ఆమోదం తెలిపింది. దీంతో డా. వి. వెంకట్రామ్ (భౌతికశాస్త్రం), డా. ఇ.సి. సురేంద్రనాథ్‌రెడ్డి (జెనిటిక్స్ అండ్ జీనోమిక్స్)లను వారి పూర్వస్థానాల్లో నియమిస్తూ వైవీయూ అధికారులు ఉత్తర్వులు జారీచేశారు.

టాప్‌లో టమాటా



గుర్రంకొండ మార్కెట్ యార్డులో బయట రాష్ట్రాలకు టమాటాలను తరలించేందుకు ప్యాకింగ్ చేస్తున్న కూలీలు



భారత దేశ చరిత్రలో టమాటా ధరలు టాప్ లేచిపోయాయి. టమాటాల చరిత్రలో మార్కెట్లో మంగళవారం అత్యధిక ధర పలికాయి. మంగళవారం మార్కెట్లో 30 కిలోల టమాటా ధర రూ.4,200 ధర పలికింది. కిలో టమాటా ధరలు రూ.140 వరకు వేలం పాటలో వ్యాపారులు పాడుకొన్నారు. దేశంలో ఆపిల్ ధరలు అత్యధికంగా ఉండగా ఆపిల్‌ను అధిగమించి ఈరోజు టమాటాలు మార్కెట్లో మొదటిస్థానంలో నిలిచాయి. ఒక క్రీట్ టమాటా ధర ఇంచుమించుగా ఒక గ్రాము బంగారం ధరకు సమానంగా ఉండడం చరిత్రలో ఇదే మొదటిసారని రైతులు చర్చించుకోవడం గమనార్హం.

- మార్కెట్లో టమాటా క్రీట్ ధర రూ.4200
- కిలో టమాటా రూ.140
- ఆపిల్ ధర మించిపోయిన టమాటా
- క్రీట్ టమాటాలు గ్రాము బంగారంతో సమానం

గుర్రంకొండ: అన్నమయ్య జిల్లాలో సాగు చేసిన టమాటాలకు దేశంలో అత్యధికంగా ధర పలికింది. మంగళవారం మదనపల్లె, గుర్రంకొండతో పాటు జిల్లాలోని పలు మార్కెట్‌యార్డుల్లో టమాటా ధరలు అత్యధికంగా కిలో రూ.140 వరకు పలికాయి. 30 కిలోల టమాటా క్రీట్ ధర రూ.4200 వరకు ధర పలికాయి. దీంతో రైతులు హర్షాతిరేకాలు వ్యక్తం చేశారు. దేశంలోని పలు రాష్ట్రాల్లో టమాటా దిగుబడి పూర్తిగా తగ్గిపోయింది. ఓవైపు అధిక వర్షాలు, మరోవైపు వైరస్, ఇతర రోగాలతో పలు రాష్ట్రాలలో టమాటా తోటలు భారీగా దెబ్బతిన్నాయి. ప్రస్తుతం దేశవ్యాప్తంగా జిల్లాలో ముఖ్యంగా పడమటి ప్రాంతాలైన (పీలేరు, మదనపల్లె, తంబళ్లపల్లె) నియోజకవర్గాల్లో ఎంతో కొంత టమాటా దిగుబడి వస్తోంది. వారం రోజుల క్రితం వరకు టమాటా ధర క్రీట్ రూ.3500 నుంచి రూ.3800 వరకు ధరలు పలికాయి. మంగళవారం నిర్వహించిన వేలం పాటల్లో టమాటా ధరలు ఒక్కసారిగా ఆకాశాన్ని అంటడంతో అందరూ ఆశ్చర్య పోయారు. టమాటా పంట దిగుబడి రోజు రోజుకు తగ్గిపోతుండడంతో మార్కెట్లో ధరలు భగ్గుమంటున్నాయని వ్యాపార వర్గాలు అంటున్నాయి.

- జిల్లా మొత్తం మీద 945 క్వింటాళ్ల టమాటాలు మార్కెట్లోకి వచ్చాయి. మొదటి రకం కిలో టమాటా ధర రూ. 140 కాగా రెండవ రకం కిలో రూ.110, మూడవ రకం కిలో రూ. 80 వరకు ధర పలకడం విశేషం. బయట రాష్ట్రాల నుంచి పెద్ద ఎత్తున వ్యాపారులు జిల్లాకు తరలివచ్చి ఇక్కడ మకాం వేశారు. మార్కెట్లో టమాటాలను కొనుగోలు చేసి వారి రాష్ట్రాలకు ఎగుమతి చేసుకొంటున్నారు. దేశంలో ఆపిల్ ధరల కంటే టమాటా ధరలు మించిపోవడం గమనార్హం. మార్కెట్లో టమాటాల డిమాండ్ ను బట్టి చూస్తే రాబోయే రోజుల్లో టమాటాల క్రీట్‌ధర రూ.5000 వరకు ధర పలుకుతాయని వ్యాపార వర్గాలు అంచనా వేస్తున్నారు.

మార్కెట్లో అత్యధిక ధరలు ఇవే ..



దేశ చరిత్రలో టమాటా మార్కెట్లో అత్యధికంగా మంగళవారం టమాటా ధరలు పలికాయి. కిలో టమాటా రూ. 140 వరకు ధర పలికాయి. 30కిలోల టమాటా క్రీట్ ధర అత్యధికంగా రూ. 4200 వరకు వేలం పాటలో వ్యాపారులు పాడుకొన్నారు. ఇంత పెద్ద ఎత్తున టమాటా ధరలు పెరగడం ఇదే మొదటిసారి. దేశవ్యాప్తంగా టమాటా దిగుబడి భారీగా తగ్గిపోయింది. అదే సమయంలో మన జిల్లాలో సాగు చేసిన టమాటాలకు దేశవ్యాప్తంగా మంచి డిమాండ్ ఏర్పడింది. బయట రాష్ట్రాల నుంచి వ్యాపారులు ఇక్కడికి వచ్చి టమాటాలను కొనుగోలు చేసి వారి రాష్ట్రాలకు ఎగుమతి చేసుకొంటున్నారు. టమాటా దిగుబడి పెరిగితేనే మార్కెట్లో ధరలు తగ్గే అవకాశముంది. – జగదీష్, మార్కెట్ కమిటీ కార్యదర్శి, వాల్మీకిపురం

తంబళ్లపల్లె పారిశ్రామికాభివృద్ధికి పునాది

- తుమ్మనంగుట్ట పీపీసీ కేంద్రాన్ని వర్చువల్‌గా ప్రారంభించిన సీఎం వైఎస్ జగన్
- సంతోషం వ్యక్తంచేసి సీఎంకు కృతజ్ఞతలు తెలిపిన రైతాంగం
- హాజరైన కలెక్టర్, ఎమ్మెల్యే, జేసీ, ఆర్డీఓ



బి.కొత్తకోటలో పీపీసీ శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న కలెక్టర్ గిరీషా, ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి, జేసీ ఫర్మాన్‌అహ్మద్ తదితరులు

బి.కొత్తకోట: తంబళ్లపల్లె నియోజకవర్గ పారిశ్రామికాభివృద్ధికి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేతులమీదుగా పునాది పడింది. పరిశ్రమలులేని నియోజకవర్గంలో పలువురికి ఉపాధి కల్పనతోపాటు ఐదువేల టమాట రైతు కుటుంబాలకు ప్రయోజనం కలిగించే బి.కొత్తకోట మండలం తుమ్మనంగుట్టలో రూ.5.50 కోట్ల వ్యయంతో నిర్మించిన పీపీసీ (ప్రైమరీ ప్రాసెసింగ్ సెంటర్)ను మంగళవారం వర్చువల్ విధానంలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రారంభించి మాట్లాడారు. అంతకుముందు వ్యవసాయ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి కూడా మాట్లాడారు. నియోజకవర్గంలో ఇది తొలి పరిశ్రమ కావడం విశేషం. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ప్రారంభోత్సవ కార్యక్రమంలో కలెక్టర్ గిరీషా, జేసీ ఫర్మాన్‌అహ్మద్, ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి, ఆర్డీఓ మురళీ, తదితర అధికారులు, రైతులు పాల్గొన్నారు. తుమ్మనంగుట్ట పీపీసీ ప్రారంభించాక కలెక్టర్, ఎమ్మెల్యే, సర్పంచు సీఎంతో మాట్లాడుతూ టమాటా సాగు పరిస్థితులు, పంట ఉత్పత్తుల తరలింపు అందుబాటులోని రైలు, రోడ్డు మార్గాలను వివరించారు. పీపీసీ ఏర్పాటుచేసి ఇక్కడి టమాటా రైతాంగానికి ఎంతో మేలు చేకూర్చారంటూ సీఎంకు కృతజ్ఞతలు తెలిపారు. టమాటాకు సంబంధించిన తొలి పరిశ్రమను ప్రారంభించారని సంతోషం వ్యక్తం చేశారు.


వర్చువల్‌గా సీఎం ప్రారంభించాక కలెక్టర్, ఎమ్మెల్యే, జేసీలు శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. వీరిని ప్రజాప్రతినిధులు సత్కరించారు. జిల్లా వ్యవసాయాధికారి చంద్రానాయక్, హార్టికల్చర్ అధికారి రవిచంద్రబాబు, వ్యవసాయ సలహా మండలి చైర్మన్ సుకుమార్‌రెడ్డి, సభ్యులు బోడేషావలీ, కుమార్‌రెడ్డి, ఏడీఏ శివశంకర్, తహసీల్దార్ రఫీక్‌అహ్మద్, ఎంపీడీఓ శంకరయ్య, ఎంపీపీ లక్ష్మినరసమ్మ, జెడ్పీటీసీ రామచంద్ర, మాజీ ఎంపీపీ పాగొండ ఖలీల్, వైస్ ఎంపీపీ ఖాదర్‌వలీ, సర్పంచులు రుక్మిణి, నాగిరెడ్డి, సాంబశివ, రవికుమార్‌రెడ్డి, గిరిజ, డీఎల్‌డీఓ లక్ష్మీపతి, రైతు ఉత్పత్తిదారుల సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు.

రైతులు సంతోషంగా ఉన్నారు




పీపీసీ ప్రారంభించడం పట్ల టమాటా రైతులు సంతోషంగా ఉన్నారు. మీకు (సీఎం) ధన్యవాదాలు తెలుపుతున్నారు సర్. రైతు ఉత్పత్తిదారుల సంఘ పరిధిలో 1,002 మంది రైతులు ఉన్నారు. ఇకపై వీరు టమాటాను 30 కిలోమీటర్ల దూరంలోని మదనపల్లె మార్కెట్‌కు తీసుకెళ్లాల్సిన అవసరం లేదు. ఇక్కడే ప్రాసెసింగ్ చేసి విక్రయించుకుంటారు. రైతులకు రవాణా ఖర్చులు, కమీషన్ల చెల్లింపు భారం తగ్గిపోతుంది. పీపీసీలో గంటకు ఒకటిన్నర టన్ను టమాటాను ప్రాసెసింగ్, 250 టన్నులు కోల్డ్‌స్టోరేజిలో నిల్వ చేసే సామర్థ్యం ఉంది. టమాటా, కూరగాయల మార్కెటింగ్‌కు లీఫ్ సంస్థతో ఒప్పందం జరిగింది. పీపీసీ పరిసరాల్లోని రైతాంగానికి ఇది ఎంతో ప్రయోజనం. –గిరీషా పీఎస్, జిల్లా కలెక్టర్

మీపైనే నమ్మకం



తంబళ్లపల్లె ప్రజలకు మీపైనే (సీఎం) ఆశలు, నమ్మకం పెట్టుకున్నారు. అందుకు తగ్గట్టుగా అభివృద్ధి జరిగింది. గెలిపించిన ప్రజలు పెట్టుకున్న నమ్మకం వమ్ముకాలేదు. ఇక్కడ జరిగే అభివృద్ధిలో మీ ముద్ర ఉంది. వెనుకబడిన తంబళ్లపల్లెలో ఈ పీపీసీ తొలి పరిశ్రమతో శుభారంభం పలికారు. ఇక పరిశ్రమలు వస్తాయని ఆశిస్తున్నాం. నియోజకవర్గానికి బెంగళూరు దగ్గర, హైవే, రైల్వే మార్గాలు ఉండటంవల్ల రవాణాకు మెరుగైన సౌకర్యాలు ఉన్నాయి. టమాటా అధికంగా సాగుచేసే రైతులు రెండేళ్లుగా నష్టాలు చూస్తున్నారని, రెండునెలలనుంచి లాభాలు చూస్తున్నారు. సీఎంగా మీరు చెప్పినదానికంటే ఎక్కువ పనులు చేస్తున్నారని ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. మళ్లీ మీరే సీఎం కావాలని ప్రజలు కోరుకుంటున్నారు. –పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి, తంబళ్లపల్లె ఎమ్మెల్యే

రైతుల కష్టం తీర్చారు



మదనపల్లె మార్కెట్‌కు టమాటా తీసుకుపోతే రాత్రంతా అక్కడే ఉండి ఉదయం వేలం పాట అయ్యాక తిరిగి ఇంటికి వచ్చేవాళ్లం. ఒకరోజు ఇల్లు, పొలాలను వదిలి ఉండాల్సి వచ్చేది. మీరు (సీఎం) పీపీసీ ఏర్పాటు చేసి మా కష్టాలు తీర్చినందుకు సంతోషంగా ఉంది. ఇకమీదట పొలాల నుంచి పంటను పీపీసీకి తీసుకెళ్లి మార్కెటింగ్ చేసుకునేలా రైతులకు అండగా నిలిచారు. పంట ఉత్పత్తుల తరలింపు కోసం నాగ్‌పూర్‌కు రైలు నడిపేలా చూడాలి. విత్తనం నుంచి విక్రయం వరకు రైతులకు అన్ని విధాలా ఆదుకుంటున్న మీకు (సీఎం) రైతుల తరపున కృతజ్ఞతలు. ఇలాంటి సీఎం మాకు ఉన్నందుకు గర్వపడుతున్నాం. –బి.నాగిరెడ్డి, శీలంవారిపల్లె సర్పంచు

క్లుప్తంగా

గాయపడిన మహిళకు ఆర్థిక సాయం



చెక్కు అందజేస్తున్న ఎంపీపీ, తహసీల్దార్

పుల్లంపేట : ఓబులవారిపల్లి మండలం చిన్నఓరంపాడు సమీపంలో ఇటీవల జరిగిన బస్సు ప్రమాదంలో పుల్లంపేట మండలం రంగపల్లి గ్రామానికి చెందిన సర్పంచ్ యానాదమ్మకు స్వల్ప గాయాలయ్యాయి. దీంతో మంగళవారం పుల్లంపేట ఎంపీపీ ముద్దా బాబుల్‌రెడ్డి, తహశీల్దార్ నరసింహకుమార్.. యానాదమ్మ కుటుంబానికి ప్రభుత్వం మంజూరు చేసిన ఆర్థిక సహాయం చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా ఎంపీపీ ముద్దా బాబుల్‌రెడ్డి మాట్లాడుతూ ప్రమాదం జరిగిన వెంటనే రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చనిపోయిన వారికి రూ.10 లక్షలు, గాయపడిన వారికి రూ.2.50 లక్షలు ఆర్థిక సహాయం అందించడం జరిగిందని తెలిపారు. నిరంతరం ప్రజల అభివృద్ధి కోసం, ప్రజల సమస్యలను పరిష్కరించేందుకు రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కృషి చేస్తున్నారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు సుదర్శన్‌రెడ్డి, యానాదయ్య, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

అభ్యంతరాలు ఉంటే తెలియజేయండి

రాయచోటి టౌన్ : ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ వారు రెవెన్యూ డిపార్ట్‌మెంట్‌లో గల గ్రూప్–4 సర్వీసెస్ జూనియర్ అసిస్టెంట్ కమ్ కంప్యూటర్ అసిస్టెంట్ పోస్టుల భర్తీ నోటిఫికేషన్ ఉత్తీర్ణత జాబితాను విడుదల చేశారు. వీటిపై అభ్యంతరాలు ఉంటే ఆగస్టు 8వ తేదీ లోగా లిఖిత పూర్వకంగా జిల్లా కలెక్టర్ కార్యాలయంలో తెలియజేయాలని ఉమ్మడి వైఎస్ఆర్ జిల్లా కార్యాలయ అధికారి గంగాధర్‌గౌడ్ సోమవారం తెలియజేశారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 51 మండలాలకు మండలానికి ఒకరు చొప్పున రోస్టర్, మెరిట్ లిస్ట్ ప్రకారం ఎంపిక చేశామని తెలిపారు. ఎంపిక లిస్టు kadapa.ap.gov.in వెబ్‌సైట్‌లో ఉంచామని పేర్కొన్నారు.

చెట్టును ఢీకొన్న ఎలక్ట్రిక్ బస్సు



వాల్మీకిపురం : అదుపుతప్పి ఆర్టీసీ ఎలక్ట్రిక్ బస్సు ఓ చెట్టును ఢీకొన్న సంఘటన మండంలోని చింతపర్తి సమీపంలో మంగళవారం చోటు చేసుకొంది. వివరాలు.. తిరుపతి అలిపిరి డిపోకు చెందిన ఎలక్ట్రిక్ నాన్‌స్టాప్ బస్సు తిరుపతి నుంచి మదనపల్లికి బయల్దేరింది. మార్గంమధ్యలోని వాల్మీకిపురం మండలం చింతపర్తి సమీపంలో ప్రమాదవశాత్తు చెట్టును ఢీకొంది. ఈ ప్రమాదంలో డ్రైవర్ మధుసూదనకు స్వల్పగాయాలు కాగా, ప్రయాణికులు సురక్షితంగా బయటపడ్డారు. గాయపడిన డ్రైవర్‌ను వాల్మీకిపురం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఎస్సై నాగేశ్వరరావు సంఘటనాస్థలానికి చేరుకొని, ప్రమాదానికి గల కారణాలపై ఆరా తీసి, కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

మణిపూర్‌లో శాంతి నెలకొల్పాలి

అఖిలపక్ష కమిటీ నేతలు, సర్వమత పెద్దల డిమాండ్



రౌండ్ టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న హరూన్ గ్రూప్ సంస్థల ఎండీ ఎస్‌బీ అహ్మద్‌బాషా

కడప కార్పొరేషన్ : మణిపూర్ రాష్ట్రంలో వెంటనే శాంతిని నెలకొల్పేందుకు కేంద్ర ప్రభుత్వం చర్యలు చేపట్టాలని అఖిలపక్ష కమిటీ నేతలు, హిందూ, ముస్లిం, క్రిష్టియన్ మతాల పెద్దలు డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక నూర్జహాన్ కల్యాణ మండపంలో హరూన్ గ్రూప్ సంస్థల మేనేజింగ్ డైరెక్టర్ ఎస్‌బీ అహ్మద్‌బాషా ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మణిపూర్‌లో జరుగుతున్న హింసాకాండ వల్ల 150 మందికిపైగా బలి అయ్యారన్నారు. ఇటీవల మహిళలను నగ్నంగా ఊరేగించిన ఘటనలపై వీడియోలు బయటికి వచ్చాయని, ఇలాంటివి వందకు పైగా జరిగాయని అక్కడి సీఎం ప్రకటించడం అక్కడి దారుణ పరిస్థితికి అద్దం పడుతున్నాయన్నారు. ఈ అమానవీయ ఘటనల పట్ల సభ్య సమాజం సిగ్గుతో తలదించుకోవాలన్నారు. జరిగింది ఎక్కడో కదా అని ఊరుకుంటే అది మనదాక చేరుతుందని హెచ్చరించారు. ఎక్కడైతే స్త్రీలు పూజింపబడుతారో, అక్కడ దేవతలు కొలువై ఉంటారని పురాణాలు చెబుతున్నాయని, స్త్రీలను పూజించి గౌరవించే మన దేశంలో ఈ తరహా ఘటనలు జరగడం దురదృష్టకరమన్నారు. ప్రజలు క్షేమంగా ఉంటేనే ఏ దేశమైనా బాగుంటుందన్నారు. మనం ఏ మతం, ప్రాంతం, జాతి, తెగకు చెందినా...మనందరం మనుషులమని, మన లో ప్రవహించేది ఒకటే రక్తమేనని గుర్తు చేశారు. ప్రజాస్వామ్యానికి గొడ్డలిపెట్టు అయిన ఇలాంటి అమానుష ఘటనలను అందరం ముక్త కంఠంతో ఖండించాలన్నారు. శాంతిభద్రతలను పరిరక్షించడంలో మణిపూర్ రాష్ట్ర ప్రభుత్వం ఘోరంగా విఫలమైందన్నారు. కేంద్రం వెంటనే స్పందించి మణిపూర్‌లో ప్రజలకు రక్షణ కల్పించాలని, బాధితులైన వారికి పరిహారం, పునరావాసం కల్పించాలన్నారు. మణిపూర్ ప్రభుత్వంపై ప్రజలు నమ్మకం కోల్పోయారని, విధానపరమైన నిర్ణయాలతో మళ్లీ నమ్మకాన్ని పెంపొందించాలన్నారు. అప్పటి వరకూ అందరం కలిసి కట్టుగా ఉద్యమించాలని పిలుపునిచ్చారు. ఇందుకు రాజకీయపార్టీలు, మీడియా, ప్రజా ప్రతినిధులు, అధికారులు సహకారమందించాలని కోరారు. ఈ ఘటనలపై ముందుగా స్పందించిన సుప్రీంకోర్టు చీఫ్ జస్టిస్ చంద్రచూడ్‌కు సభ ధన్యవాదాలు తెలిపింది. అంతకుముందు మణిపూర్‌లో బలైన వారి కోసం రెండు నిమిషాలు మౌనం పాటించి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రిగేషనల్ టౌన్ చర్చి ఫాదర్ మోహన్, ఫాదర్ సుబుద్ది, సీఎస్ఐ సెంట్రల్ చర్చి ఫాదర్ మత్తయ్యబాబు, ముఫ్తీ రహిముల్లా ఖాన్, మహమ్మద్ అలీ బాగ్దాది, మౌల్వీ ఖాజీ షేక్ మహమ్మద్ అలీ రషాదీ, జిల్లా అర్చక సమాఖ్య నాయకులు విజయ్ భట్టర్, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి అఫ్జల్‌ఖాన్, కార్పొరేటర్లు ఎం.సుబ్బారెడ్డి, షఫీ, ఆ పార్టీ నేతలు బంగారు నాగయ్య, సుభాన్‌బాషా, ఎన్.సుబ్బారెడ్డి, టీడీపీ నాయకుడు జిలానీబాషా, కాంగ్రెస్ నాయకులు బండి జకరయ్య, నజీర్ అహ్మద్, సంఘసేవకుడు సలావుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

వస్త్ర దుకాణంలో అగ్నిప్రమాదం



అగ్నిప్రమాదంలో కాలిపోయిన వస్త్రాలు

మదనపల్లె : పట్టణంలోని ఆర్.ఆర్.స్ట్రీట్‌లోని ఓ వస్త్రదుకాణంలో మంగళవారం తెల్లవారుజామున అగ్నిప్రమాదం జరిగింది. పట్టణంలోని మోతీనగర్‌కు చెందిన ఎస్.కే.మైనుద్దీన్ ఆర్.ఆర్.స్ట్రీట్‌లోని ఆర్.ఆర్.కాంప్లెక్స్ సెల్లార్‌లో తాజ్ కట్‌పీస్ సెంటర్ వస్త్రదుకాణం నిర్వహిస్తున్నారు. సోమవారం రాత్రి యథావిధిగా దుకాణం మూసివేసి ఇంటికి చేరుకున్నారు. మంగళవారం వేకువజామున 3 గంటలకు షాపు నుంచి పొగలు బయటకు వస్తున్నాయని స్థానికులు సమాచారం అందించడంతో.. అక్కడికి చేరుకుని అగ్నిమాపకశాఖ అధికారులకు సమాచారం అందించారు. దీంతో స్థానిక అగ్నిమాపకశాఖ ఎస్ఐ పురుషోత్తంనాయుడు సిబ్బందితో కలిసి సంఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపులోకి తెచ్చారు. విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో అగ్నిప్రమాదం జరిగిందని ప్రాథమిక దర్యాప్తులో తేల్చారు. ప్రమాదంలో రూ.3 లక్షల మేర ఆస్తినష్టం జరిగి ఉంటుందని అంచనా వేశారు. వేకువజామున అగ్నిప్రమాదం చోటు చేసుకోవడం, ఆ సమయంలో ఇతర దుకాణాలు తెరవకపోవడం, జనసంచారం లేకపోవడంతో ఎక్కువ ఆస్తి, ప్రాణ నష్టం జరగకుండా ప్రమాదం తప్పింది. ఆర్.ఆర్. కాంప్లెక్స్‌లో సెల్లార్‌లో నిర్వహిస్తున్న దుకాణ సముదాయాల్లో పగటిపూట అగ్నిప్రమాదం జరిగి ఉంటే కోట్లలో ఆస్తినష్టంతోపాటు ప్రజల ప్రాణాలకు ఇబ్బంది కలిగి ఉండేది.

దోషులను కఠినంగా శిక్షించాలి



టాక్సీ డ్రైవర్స్ అసోసియేషన్ సభ్యుల నిరసన

మదనపల్లె : మణిపూర్‌లో ఆదివాసీ మహిళలపై అత్యాచారం చేసి, వారికి సంబంధించిన వ్యక్తులను హత్య చేసిన దోషులను కఠినంగా శిక్షించాలని నవ యువ టాక్సీ డ్రైవర్స్, ఓనర్స్ అసోసియేషన్ సభ్యులు డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక టౌన్‌బ్యాంక్ సర్కిల్‌లో మణిపూర్ మహిళలపై పైశాచిక దాడులను ఖండిస్తూ నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా అసోసియేషన్ సభ్యులు భాస్కర్, ఎం.మధుబాబు, జవహర్ బాషా మాట్లాడుతూ ఆదివాసీ మహిళలను నగ్నంగా ఊరేగించినా అక్కడి రాష్ట్రప్రభుత్వం చర్యలు తీసుకోకపోవడాన్ని తీవ్రంగా ఖండించారు. గిరిజన స్త్రీలపై అఘాయిత్యం చేసిన వారిని అరెస్ట్ చేసి శిక్షించాలన్నారు. కేంద్రప్రభుత్వం, మణిపూర్‌లోని రాష్ట్రప్రభుత్వం రాజకీయ దురుద్దేశంతో మైతీలు, కుకీలు వర్గాల మధ్య గొడవలు సృష్టించాయన్నారు. మణిపూర్‌లో దమనకాండను బయటకు రానివ్వకుండా ఇంటర్నెట్ సేవలను సైతం నిలుపుదల చేసిన కేంద్రప్రభుత్వ తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. మణిపూర్ రాష్ట్ర ప్రభుత్వాన్ని వెంటనే బర్తరఫ్ చేసి ప్రజాస్వామ్యాన్ని కాపాడాలని నినాదాలు చేశారు. కార్యక్రమంలో నవ యువ టాక్సీ డ్రైవర్స్, ఓనర్స్ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి



షాకత్‌అలీ మృతదేహం

తంబళ్లపల్లె : ఓ వ్యక్తి అనుమానాస్పద స్థితిలో మృతి చెందిన సంఘటన ఆలస్యంగా మంగళవారం వెలుగు చూసింది. మండలంలోని పెద్దేరుప్రాజెక్టు గంగిరెడ్డిపల్లె పంచాయతీ రేకులకుంట తండా మధ్యలో బొగ్గులోని బండపై ఓ మృతదేహం పడి ఉండటాన్ని గుర్తించిన దారిన పోయేవారు పోలీసులకు సమాచారం అందజేశారు. ఎస్ఐ శోభరాణి సిబ్బందితో సంఘటనా స్థలానికి చేరుకుని శవాన్ని పరిశీలించి ములకలచెరువు సీఐ సాధిక్‌అలీకి సమాచారాన్ని ఇచ్చారు. వెంటనే సీఐ సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. మృతదేహం పక్కన ఉన్న సంచిని విప్పి చూడగా అందులో 3 జతల బట్టలు, వాటిలో బి.కొత్తకోటలో ల్యాబ్‌లో రక్తపరీక్షలు చేసుకున్న రశీదును గుర్తించారు. ఆ రశీదులోని ఫోన్ నంబర్ గల ల్యాబ్‌టెక్నీషియన్‌కు ఫోన్ చేశారు. అతడికి వైద్యం అందించిన డాక్టర్ మాట్లాడుతూ అతడి లివర్ పూర్తిగా దెబ్బతిని జాండీస్‌తో ఇబ్బంది పడుతున్నట్లు తెలిపారు. అతడు బి.కొత్తకోట మండలం బీరంగికి చెందిన వ్యక్తి షాకత్‌అలీ(38)గా నిర్ధారించారు. పెళ్లి లేక, కుటుంబీకులు ఎవరూ లేకపోవడంతో కూలి పని చేసుకుని బతికేవాడని విచారణలో తేలింది. వీఆర్వో భరత్‌నాయక్ సమక్షంలో శవ పంచనామా నిర్వహించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మదనపల్లె జిల్లా ఆసుపత్రికి తరలించారు. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

కుక్కల దాడిలో జింకకు గాయాలు



మదనపల్లె : మండల పరిధి మాలేపాడు గ్రామ సమీపంలోని అటవీ ప్రాంతంలో మంగళవారం ఓ జింక కుక్కల దాడిలో తీవ్రంగా గాయపడింది. గమనించిన గ్రామస్తులు అటవీశాఖ అధికారులకు సమాచారం అందించడంతో.. ఎఫ్‌ఆర్వో మదన్‌మోహన్‌రెడ్డి, సిబ్బందితో కలిసి గాయపడ్డ జింకను వైద్యసేవల నిమిత్తం పట్టణంలోని ఓ ప్రైవేట్ జంతువైద్యశాలకు తరలించారు. అక్కడ డాక్టర్ షిరీన్‌లారెన్స్ వైద్యచికిత్సలు అందించారు. జింక అడవిలో బాగా మేత మేసి ఉండటంతో కుక్కలు వెంటపడితే పరుగెత్తలేకపోయిందని, దాడిలో జింక కడుపు భాగంలో, మెడమీద తీవ్ర గాయాలు అయ్యాయన్నారు. దీంతో జింకకు యాంటీ రేబిస్ ఇంజెక్షన్‌తోపాటు కడుపునకు కుట్లువేసి గాయాలకు చికిత్స అందించినట్లు చెప్పారు. ప్రస్తుతం జింక పరిస్థితి విషమంగానే ఉందని, అటవీశాఖ అధికారుల సంరక్షణలో ఉంచినట్లు చెప్పారు.

యూఏఈలో అన్నమయ్య జిల్లా యువకుడి మృతి

ఏపీఎన్‌ఆర్‌టీఎస్ సాయంతో స్వస్థలానికి మృతదేహం



మునిరాజు (ఫైల్)

కడప కార్పొరేషన్ : ఎన్నో ఆశలు.. కోరి కలతో పొట్ట చేత పట్టుకొని జీవనోపాధి కోసం ఏడారి దేశమైన యూఏఈ(దుబాయ్)కి వెళ్లిన అన్నమయ్య జిల్లాకు చెందిన యువకుడు కేవలం 25 రోజులకే శవమై తిరిగొచ్చాడు. ఏపీఎన్ఆర్‌టీఎస్ సభ్యుల సహకారంతో అతని మృతదేహాన్ని స్వస్థలానికి తీసుకొచ్చారు. వివరాలిలా ఉన్నాయి. అన్నమయ్య జిల్లా బి.కొత్తకోట మండలం నామాలపల్లికి చెందిన జి.మునిరాజు(22) అనే యువకుడు ఇటీవల దుబాయ్ వెళ్లాడు. అక్కడ ఏం జరిగిందో ఏమో తెలియదుగానీ ఈనెల 14వ తేదీన అనుమానాస్పద రీతిలో ఉరికి వేలాడుతూ కనిపించాడు. మునిరాజు బంధువొకరు ఈ విషయాన్ని వైఎస్సార్‌సీపీ కువైట్ కన్వీనర్ సయ్యద్ అక్రం దృష్టికి తీసుకొచ్చి, అతని మృతదేహాన్ని స్వస్థలం పంపేందుకు సహాయం చేయాలని అభ్యర్థించాడు. దీనిపై వెంటనే స్పందించిన ఏపీఎన్‌ఆర్‌టీఎస్ ప్రావిజనల్ కో ఆర్డినేటర్ టి. మోహన్‌రావు భారత రాయబార అధికారులతో మాట్లాడి ఎంబసీ ద్వారా ఉచిత టికెట్ ఇప్పించారు. ఈ మేరకు మునిరాజు మృతదేహం ఈ నెల 24వ తేదీన యూఏఈ నుంచి ఎయిర్ ఇండియా ద్వారా 25న చెన్నైకి చేరింది. అక్కడి నుంచి ఏపీఎన్‌ఆర్‌టీఎస్ ఉచిత అంబులెన్స్‌లో నామాలపల్లికి తీసుకొచ్చారు. ఈ సందర్భంగా సయ్యద్ అక్రం, మోహన్‌రావు మాట్లాడుతూ చిన్నవయసులో మునిరాజు అనుమానాస్పద రీతిలో మరణించడం బాధాకరన్నారు. మృతుడి అన్న శ్రీకాంత్ మాట్లాడుతూ ఏపీఎన్‌ఆర్‌టీఎస్ ద్వారా ప్రవాసాంధ్రుల సమస్యలు పరిష్కరిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి, భారత ఎంబసీ అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు. తమకు సాయం చేసిన ఏపీఎన్‌ఆర్‌టీఎస్ చైర్మన్ మేడపాటి వెంకట్, సీఈఓ హేమలత, డైరెక్టర్ ఇలియాస్‌లకు ధన్యవాదాలు తెలిపారు.

ఆత్మహత్యకు యత్నించిన మహిళ మృతి

పెద్దమండ్యం : ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఒక మహిళ మంగళవారం మృతి చెందినట్లు ఎస్ఐ రామాంజనేయుడు తెలిపారు. ఎస్ఐ కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. మండలంలోని ఎస్‌మోపల్లె పంచాయతీ మిట్టావాండ్లపల్లెకు చెందిన ఎం. విశ్వనాథరెడ్డి భార్య ఎం.రమణమ్మ (40) కడుపునొప్పితో బాధపడుతూ ఆసుపత్రుల్లో చికిత్సలు చేయించుకుంది. కడుపునొప్పి భరించలేక ఈ నెల 16న ఇంటి వద్ద క్రిమి సంహారణ మందు తాగింది. కుటుంబ సభ్యులు గమనించి 108 ద్వారా రాయచోటి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడ నుంచి తిరుపతిలోని ఒక ప్రైవేటు ఆసుపత్రి తీసుకెళ్లి చికిత్సలు చేయించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో వేలూరు సిఎంసికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. మృతురాలి కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు. మృతురాలికి ఇద్దరు పిల్లలు ఉన్నట్లు చెప్పారు.

పేకాట స్థావరంపై మెరుపుదాడి



పట్టుకున్న నిందితులు, నగదును చూపుతున్న డీఎస్పీ కేశప్ప

మదనపల్లె : పట్టణంలోని ఓ ప్రైవేట్ హోటల్‌లో గుట్టుచప్పుడు కాకుండా నిర్వహిస్తున్న పేకాట స్థావరంపై డీఎస్పీ కేశప్ప ఆధ్వర్యంలో పోలీసులు మంగళవారం సాయంత్రం మెరుపుదాడులు నిర్వహించారు. 11 మంది జూదరులు, హోటల్ యజమాని, మేనేజర్‌తో కలిపి మొత్తం 13 మందిని అరెస్ట్ చేసి, వారి వద్ద నుంచి రూ.1,47,980 నగదుతోపాటు 14 సెల్‌ఫోన్లు, రెండు పేక కట్టలను స్వాధీనం చేసుకున్నారు. టూటౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో డీఎస్పీ కేశప్ప వివరాలు వెల్లడించారు. ప్రైవేట్ హోటల్‌లో గత కొంత కాలంగా పేకాట నిర్వహిస్తున్నట్లు సమాచారం అందడంతో వన్‌టౌన్ సీఐ మహబూబ్‌బాషా, ఎస్ఐలు సుబ్బారెడ్డి, మధురామచంద్రుడు, వెంకటేష్, పోలీసు సిబ్బందితో కలిసి స్వయంగా దాడుల్లో పాల్గొన్నట్లు చెప్పారు. హోటల్‌లోని రూమ్ నంబర్లు: 202, 203లో దాదాపు 11మందికి పైగా పెద్ద మొత్తంలో డబ్బులు పెట్టి రెండు బ్యాచ్‌లుగా జూదం ఆడుతున్నట్లు గుర్తించామన్నారు. దీంతో వారిని అదుపులోకి తీసుకుని సెల్‌ఫోన్లను, నగదును సీజ్ చేశామన్నారు. అక్కడి పరిసరాలను పరిశీలిస్తే ఆర్గనైజింగ్ గ్యాంబ్లింగ్ నిర్వహిస్తున్నట్లు స్పష్టమైందన్నారు. నిందితులు అన్నమయ్య జిల్లాలోని మదనపల్లె, రాయచోటి, నిమ్మనపల్లె, సంబేపల్లె తదితర ప్రాంతాలకు చెందిన వారిగా గుర్తించామన్నారు. వీరి వాలకం చూస్తే రెగ్యులర్‌గా జూదం ఆడేవారని తెలుస్తోందన్నారు. వీరిపై నిఘా ఉంచి, ఫోన్ కాల్‌డేటా ఆధారంగా దర్యాప్తు మరింత లోతుగా చేస్తామన్నారు. పట్టుబడిన నిందితుల్లో సహదేవరెడ్డి, రంగారెడ్డి, ప్రవీణ్‌కుమార్, మోహన్‌రెడ్డి, మోహన్, సహదేవరెడ్డి, రమేష్‌బాబు, అక్బర్‌ఖాన్, యు.రాజు, ఓబుల్‌రెడ్డి, తాతాజీ తదితరులున్నారన్నారు. మదనపల్లె పోలీస్ సబ్‌డివిజన్ పరిధిలో పేకాట స్థావరాలపై స్పెషల్‌పార్టీ, టాస్క్‌ఫోర్స్ పోలీసుల ఆధ్వర్యంలో నిఘా పెంచుతామన్నారు. పట్టణంలోని లాడ్జిల్లో, హోటల్స్‌లో జూదం నిర్వహిస్తుంటే.. జూదగాళ్లతోపాటు యజమానులను అరెస్ట్ చేస్తామన్నారు. జిల్లా ఎస్పీ గంగాధరరావు సూచనల మేరకు నిందితులపై సస్పెక్ట్‌షీట్ ఓపెన్ చేస్తామన్నారు.

చిన్నారులకు రూ. 10 లక్షల సాయం



పిల్లలతో ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి

- నలుగురు పిల్లలకు చదువులు చెప్పిస్తాం
- ఎంపీ మిథున్‌రెడ్డి, ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి

సాక్షి ఎఫెక్ట్..

బి.కొత్తకోట : సాక్షిలో సోమవారం 'ఘొల్లుమన్న గుట్టపాళ్యం' శీర్షికన ప్రచురితమైన కథనంపై రాజంపేట ఎంపీ మిథున్‌రెడ్డి, తంబళ్లపల్లె ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి చలించిపోయారు. అనాథలైన పిల్లలను ఆదుకునేందుకు తక్షణమే చర్యలు తీసుకోవాలని ఎంపీ మిథున్‌రెడ్డి సూచన మేరకు ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి మంగళవారం బి.కొత్తకోట మండలం నాయనబావి పంచాయతీ గుట్టపాళ్యంలోని మంజునాథరెడ్డి ఇంటికి స్వయంగా వెళ్లారు. గత శనివారం మంజునాథ్‌రెడ్డి (36) ఆత్మహత్యకు పాల్పడటం, ఏనిమిదేళ్ల క్రితమే ఆయన భార్య అరుణమ్మ మృతి చెందడంతో వారి సంతానం ముగ్గురు కుమార్తెలు, కుమారుడు అనాథలైన విషయాన్ని 'సాక్షి' వెలుగులోకి తీసుకొచ్చింది. గుట్టపాళ్యంలోని వారి ఇంటికి వచ్చిన ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి పిల్లలు హిమబిందు (17), మనోజ్ఞ (13), మృదుల (12), మిథున్‌రెడ్డి (11)లను పరామర్శించారు. పిల్లల మామ మురళీతో మాట్లాడి కుటుంబ ఆర్థిక పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. తల్లిదండ్రులు లేని లోటు తీర్చలేనిదని ఆవేదన వ్యక్తం చేశారు. పిల్లలకు ధైర్యం చెబుతూ అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. పిల్లల భవిష్యత్తు కోసం ఒక్కో బిడ్డ పేరిట రూ.2.50 లక్షల చొప్పున రూ.10 లక్షలు బ్యాంకులో డిపాజిట్ చేయిస్తానని ప్రకటించారు. పిల్లల చదువుకు చర్యలు తీసుకుని చదివిస్తామని, భయపడొద్దని అన్నారు. ఎమ్మెల్యే ప్రకటించిన సహాయం, చదువులకు భరోసా ఇవ్వడంపై నియోజకవర్గంలో ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ పాగొండ ఖలీల్, మార్కెట్ కమిటీ వైస్‌చైర్మన్ రెడ్డెమ్మ, ఎంపీటీసీ రామసుబ్బారెడ్డి, కోఆప్షన్ సభ్యులు నాసిర్‌వలీ, జాబీర్, ప్రభాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

మహిళ ఆత్మహత్యాయత్నం

గాలివీడు : గోరాన్‌చెరువు గ్రామం కరిమిరెడ్డిగారిపల్లెకు చెందిన చీకటి వెంకటలక్ష్మి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. మంగళవారం కరిమిరెడ్డిగారిపల్లెలోని తన నివాసంలో గుళికల మందు సేవించి ఈ అఘాయిత్యానికి పాల్పడింది. బంధువుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. కరిమిరెడ్డిగారిపల్లెకు చెందిన చీకటి వెంకటేష్, చీకటి శ్రీరాములు అన్నదమ్ములు. చీకటి వెంకటేష్ గతంలో వీఆర్‌ఏగా పని చేసేవాడు. ప్రస్తుతం ఆయన కుమారుడు చీకటి సురేష్ కుమార్ తండ్రి విధులు నిర్వర్తిస్తున్నాడు. ఇది ఇలా ఉండగా చీకటి శ్రీరాములు భార్య వెంకటలక్ష్మి జీవనోపాధి కోసమై కడపకు వలస వెళ్లింది. ఇదే అదునుగా భావించిన చీకటి వెంకటేష్ కుమారుడు సురేష్‌కుమార్ (వీఆర్‌ఏ) తన చిన్నాన్న చీకటి శ్రీరాములుకు చెందిన 1.10 ఎకరాల భూమిని ఆన్‌లైన్‌లో తన పేరుతో నమోదు చేసుకున్నాడు. ఈ విషయమై ఆమె అనేక సార్లు తమ భూమిని తమకు ఇవ్వాలని వారిని, అధికారులను కోరింది. అయినా ప్రయోజనం లేకపోయింది. దీంతో ఆత్మహత్యకు ప్రయత్నించింది. ప్రస్తుతం ఆమె పరిస్థితి ఆందోళనకరంగా ఉందని, కడప రిమ్స్‌లో చికిత్స పొందుతోందని బంధువులు తెలిపారు.

వెంటాడిన దురదృష్టం

- వైద్యం చేయించుకునేందుకు కారులో వెళుతూ...
- రోడ్డు ప్రమాదంలో అథ్లెటిక్ కోచ్ మృతి



హరికృష్ణమరాజు (ఫైల్)

రాజంపేట టౌన్ : అనారోగ్యం బారిన పడటంతో వైద్యం చేయించుకునేందుకు కుటుంబ సభ్యుల సహాయంతో కారులో తిరుపతికి వెళుతున్న అథ్లెటిక్ కోచ్ హరికృష్ణమరాజు (39)ను దురదృష్టం వెంటాడింది. కుటుంబ సభ్యులు తెలిపిన మేరకు వివరాలిలా వున్నాయి. స్పోర్ట్ అథారిటి ఆఫ్ ఆంధ్రప్రదేశ్ (శాప్) విభాగంలో రాజంపేట అథ్లెటిక్ కోచ్‌గా హరికృష్ణమరాజు కాంట్రాక్టు పద్ధతిపై పని చేస్తున్నాడు. ఆయన గత కొంతకాలంగా కామెర్ల వ్యాధితో బాధపడుతుండేవారు. ఈ నేపథ్యంలో కుటుంబ సభ్యులు మెరుగైన వైద్యం చేయించేందుకు ఈ నెల 24వ తేదీ తెల్లవారుజామున కారులో చెన్నైకి తీసుకెళుతుండగా.. రాజంపేట బైపాస్‌రోడ్డులో ఆగి వున్న లారీని కారు ఢీకొట్టింది. దీంతో హరికృష్ణమరాజుకు కాలు విరగడంతోపాటు ఛాతి కారులోని ముందు సీటుకు బలంగా కొట్టుకుంది. అలాగే అతని తండ్రి రిటైర్డ్ హెడ్‌కానిస్టేబుల్ నరసింహరాజుకు పక్కటెముకలు విరిగాయి. ఇదే ప్రమాదంలో కారు డ్రైవర్ సురక్షితంగా బయటపడగా, హరికృష్ణమరాజు భార్య స్వల్ప గాయాలతో బయటపడింది. ఇదిలావుంటే తీవ్రంగా గాయపడిన తండ్రి కొడుకులను కుటుంబ సభ్యులు మెరుగైన వైద్యం కోసం తిరుపతిలోని ఓ కార్పొరేట్ హాస్పిటల్‌లో చేర్పించారు. సోమవారం రాత్రి హరికృష్ణమరాజుకు శ్వాస పీల్చుకోవడం ఇబ్బందిగా ఉండటంతో ఆ హాస్పిటల్ వైద్యులు పరిస్థితి విషమంగా ఉందని, ఇంటికి తీసుకెళ్లాలని సూచించారు. దీంతో కుటుంబ సభ్యులు తిరుపతిలోని రుయాసుపత్రికి తీసుకెళ్లగా ఆయన అక్కడ చికిత్స పొందుతూ మంగళవారం ఉదయం మృతి చెందాడు. దీంతో మృతుని స్వగ్రామమైన రాజంపేట మండలం ఎల్లాగడ్డలో తీవ్ర విషాద ఛాయలు అలుముకున్నాయి. ఇదిలావుంటే బుధవారం జరిగే మృతుని అంత్యక్రియలకు తండ్రి నరసింహరాజును ప్రత్యేక వాహనంలో తీసుకురానున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. మృతునికి భార్య, ఒక కుమారుడు ఉన్నాడు. నిత్యం ఉదయం ఆరు గంటలకే ప్రభుత్వ జూనియర్ కళాశాల క్రీడామైదానానికి వచ్చి క్రీడాకారులకు శిక్షణ ఇచ్చే హరికృష్ణమరాజు ఇక లేరు అన్న చేదు నిజాన్ని ఆయన శిష్యులు జీర్ణించుకోలేక పోతున్నారు. హరికృష్ణమరాజు మృతి పట్ల ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డి, జెడ్పీ చైర్మన్ ఆకేపాటి అమర్‌నాథ్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్, వాలీబాల్ అసోసియేషన్ ఉమ్మడి వైఎస్సార్ జిల్లా అధ్యక్షుడు పోలా శ్రీనివాస్‌రెడ్డి, ఆర్ఐపీ జి.భానుమూర్తిరాజు, వాలీబాల్ అసోసియేషన్ జిల్లా ఉపాధ్యక్షుడు ఎస్.షామీర్‌బాషా తమ ప్రగాఢ సంతాపం తెలిపారు.